



- ఎన్టీఆర్ పింఛన్లు తొలిరోజే 96 శాతం పంపిణీ
- జిల్లాలో 2,67,380 మంది లబ్దిదారులకు అందజేత
- లబ్దిదారులలో నెలకొన్న ఆనందం

పింఛన్ల పండగ

కూటమి ప్రభుత్వం వచ్చాక రెండో నెల పింఛన్ల పంపిణీ విజయవంతంగా సాగింది. ఉదయం నుంచి రాత్రి దాకా అన్ని రకాల పింఛన్లను పంపిణీ చేయడంలో యంత్రాంగం నిమగ్నమైంది. గత నెల పెంచిన పింఛను రూ.4 వేలతోపాటు అదనంగా మూడు వేలు కలిపి ఏకంగా రూ.7 వేలు పంపిణీ చేసింది. అలాగే దివ్యాంగులకు రూ.6వేల పింఛను పంపిణీ చేసింది. ఈనెల వృద్ధులు, ఇతర వర్గాల వారికి పెంచిన పింఛను రూ.4వేలు, దివ్యాంగులకు రూ. 6వేలు అందించారు. దీంతో ఆయా వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది.

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు1: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ తొలిరోజు విజయవంతంగా సాగింది. తొలిరోజు గురువారం ఒక్కరోజే 96.32 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో 2,77,594 మంది లబ్ధిదారులు ఉండగా దీనిలో 2,67,380 మంది లబ్ధిదారులకు అందజేశారు. దీంతో పింఛన్‌దారులు ఎంతో ఆనందం వ్యక్తంచేశారు. మండలాల వారీగా పంపిణీ తీరును పరిశీలిస్తే పిఠాపురం అర్బన్‌లో 97.82 శాతం పంపిణీ చేశారు. అలాగే గొల్లప్రోలు అర్బన్‌లో 97.62 శాతం, కాకినాడ అర్బన్‌లో 97.55శాతం, కరపలో 97.47శాతం, సామర్లకోట అర్బన్‌లో 97.45 శాతం, తుని అర్బన్‌లో 97.10 శాతం పింఛన్ల పంపిణీ చేశారు. పెద్దాపురంలో 97.10శాతం, ఏలేశ్వరం అర్బన్‌లో 96.98 శాతం, శంఖవరంలో 96.79శాతం, తునిరూరల్‌లో 96.74 శాతం, తాళ్లరేవులో 96.52 శాతం, పెద్దాపురం అర్బన్‌లో 96.40శాతం, పెదపూడిలో 96.38 శాతం నమోదైంది. కాకినాడ రూరల్ మండలంలో 96.32శాతం, పిఠాపురం రూరల్ మండలంలో 96.31శాతం, ఏలేశ్వరం మండలంలో 95.97 శాతం, సామర్లకోట రూరల్ మండలంలో 95.96 శాతం, కోటనందూరులో 95.89 శాతం, తొండంగిలో 95.89 శాతం, గండేపల్లిలో 95.81శాతం, కొత్తపల్లిలో 95.62శాతం, రౌతులపూడిలో 95.56శాతం, కాజులూరులో 95.35శాతం, జగ్గంపేటలో 95.22శాతం, ప్రత్తిపాడులో 95.06శాతం, గొల్లప్రోలు మండలంలో 95.06శాతం, కిర్లంపూడి మండలంలో 94.96శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి వెల్లడించారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి తొలిరోజే 96శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారని పేర్కొన్నారు.



పిఠాపురం మండలం చిత్రాడలో పింఛన్లు అందజేస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఎమ్మెల్సీ హరిప్రసాద్, ఇతర నాయకులు

కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట

ప్రతి హామీని నూరుశాతం అమలు చేస్తాం : నాగబాబు

పిఠాపురం రూరల్, ఆగస్టు1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నూరుశాతం నెరవేరుస్తామని జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. పిఠాపురం మండలం చిత్రాడలో గురువారం జరిగిన ఇంటింటికి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందజేశారు. దివ్యాంగుడు లోవబాబుకు రూ.6వేలు, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలిసిస్ చేయించుకుంటున్న వంగపండు సన్యాసిరావు రూ.10వేలు పింఛన్ ఇచ్చి వారితో మాట్లాడి యోగక్షేమాలు ఆరా తీశారు. రాష్ట్రంలో వాతావరణం ప్రశాంతంగా ఉందని, వైసీపీ నేతలు గగ్గోలు పెట్టినట్టు ఏమి జరగడం లేదన్నారు. ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇవ్వడం ఒక బాధ్యత అని, సొమ్ములు అందిస్తున్నప్పుడు వారి కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం జీవితాన్ని ధన్యం చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరుగుతోందని చెప్పారు. మొదటి రోజునే నూరుశాతం పింఛన్లు అందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, వృద్ధులు పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వస్తోందని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు అది పటాపంచలు అయిందన్నారు. ఎన్నికల ముందు, ప్రచారంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్ పాల్గొన్నారు.



కాకినాడ పదవ డివిజన్ దుమ్ములపేటలో సామాజిక పింఛను పంపిణీ చేస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

ఎన్టీఆర్ భరోసా పర్యవేక్షించిన కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ గురువారం పర్యవేక్షించారు. 46వ డివిజన్ పరిధిలోని మిలిటరీ రోడ్డు ప్రాంతంలో సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని కమిషనర్ పరిశీలించారు. ఆ ప్రాంతంలోని లబ్ధిదారులకు స్వయంగా ఆమె పింఛన్లు అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను అందజేత

కిర్లంపూడి, ఆగస్టు 1: కిర్లంపూడి మండలంలో మొదటిరోజు పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తిచేశామని ఎంపీడీవో బడే రాజేశ్వరరావు తెలిపారు. క్షేత్రస్థాయిలో భాగస్వామ్యమైన పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. కృష్ణవరంనకు చెందిన పింఛనుదారు దాసరి నూకరత్నం పెరాలసిస్ కారణంగా రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సతీష్ ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ చేశారు.



రాజానగరం జీఎస్ఎల్‌లో పింఛను అందిస్తున్న దృశ్యం

పిఠాపురం పాదగయ క్షేత్రంలో పురుహూతికాఅమ్మవారికి సమర్పించేందుకు సారె తీసుకుని విరవ నుంచి పాదయాత్రగా వస్తున్న పద్మావతి శ్రీవారి సేవా సంఘం సభ్యులు, మహిళలు



పాదగయలో అమ్మవార్లకు సారె సమర్పణ

పిఠాపురం, ఆగస్టు1: పిఠాపురం పట్టణంలో పాదగయ క్షేత్రం పరిసరాలు గురువారం భక్తతన్మయత్వంతో ఓలలాడాయి. పాదగయలో ఉమాకుక్కుటేశ్వరస్వామివారి సన్నిధిలో ఉన్న రాజరాజేశ్వరీదేవి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్టాన దేవతయిన పురుహూతికాఅమ్మవార్లకు ఆషాఢ మాసం సారె సమర్పణకు మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చారు. విరవకు చెందిన పద్మావతి శ్రీవారి సేవా సంఘం సభ్యులు, మహిళలు పది కిలో మీటర్లు పాదయాత్రగా సారె తీసుకుని వచ్చారు. విరవ వినాయక ఆలయం వద్ద మహిళలకు ఈవో దుర్గాభవానీ సారె ఎత్తారు. విరవ, ఎఫ్‌కే పాలెం, కందరాడ, కుమారపురం గ్రామాల మీదుగా పిఠాపురం పాదగయ క్షేత్రానికి చేరుకున్నారు. వీరంతా తాము స్వయంగా వండి తీసుకువచ్చిన పిండివంటలు, స్వీట్లు, పండ్లు, ఇతర పదార్థాలకు అమ్మవార్లకు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ తదితరులు పాదయాత్రతోపాటు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లోవ క్షేత్రంలో హోంమంత్రి అనితకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

తలుపులమ్మ సేవలో హోంమంత్రి అనిత

తుని, ఆగస్టు1: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత గురువారం సందర్శించారు. పాయకరావుపేట నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఆమె స్థానిక నాయకులతో కలిసి లోవకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు హోంమంత్రి అనితకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులువేద ఆశీర్వచనాలు అందజేయగా అధికారులు అమ్మవారి చిత్రపటంతోపాటుగా తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, స్థానిక పోలీస్ సిబ్బంది, పలువురు అధికారులు ఉన్నారు.



కాకినాడ నగరంలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

కార్పొరేషన్ (కాకినాడ),ఆగస్టు1: ఏబీసీడీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టులో తుది తీర్పురావడంతో జిల్లా అంతటా మాదిగ వర్గీయుల్లో హర్షాతిరేకాలు నెలకొన్నాయి. పలుచోట్ల ర్యాలీలు, పాలభిషేకాలు చేయడంతోపాటు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లాలోని కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, ఉప్పాడ కొత్తపల్లి, ప్రత్తిపాడు, తుని, సామర్లకోట తదితర ప్రాంతాల్లో వేడుకలు జరిపారు. కాకినాడలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ ఆధ్వర్యంలో భానుగుడి సెంటర్ నుంచి ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. భానుగుడి సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రావ్ విగ్రహాలకు పాలభిషేకం చేశారు. అలాగే మందకృష్ణమాదిగ ఫోటోకు పాలభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చాట్ల ఆశీర్వాదం, సవరపు జాన్సన్, మిరియాల వీరబాబు, రాజు, కృష్ణమాదిగ పాల్గొన్నారు.

పిఠాపురంలో వేడుకలు

పిఠాపురం, ఆగస్టు1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తంచేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు గురువారం పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెదపాటి బాలకృష్ణ, వేమగిరి రాంబాబు, గాడిచర్ల బాల, తాతపూడి చిట్టిబాబు, పెదపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.





ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల పిఠాపురంలో సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు హర్షణీయం

కరప, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని టీడీపీ నేత, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్ర ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. కరపలో గురువారం ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని, దీనివల్ల వెనుకబడిన కులాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. 2004లో అప్పటి సీఎం చంద్రబాబు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపించారని, ఇప్పుడు మళ్లీ ఆయన చేతుల మీదుగా వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించనుండడం ఆనందంగా ఉందన్నారు. వర్గీకరణ కోసం పోరాడిన మంద కృష్ణమాదిగకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటం ఫలించింది

మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు

తుని రూరల్, ఆగస్టు1: ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటం ఫలించిందని శాసనమండలి ప్రతిపక్షనేత, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. షెడ్యూల్ కులాల వర్గీరణపై సుప్రీంకోర్టు తీర్పును టీడీపీ స్వాగతిస్తోందని, సంక్షేమ రాజకీయ చరిత్రలో ఇదొక మైలురాయని ఆయన అభివర్ణించారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ సుదీర్ఘపోరాటం ఫలించిందని, అంతిమంగా విజయం సాధించారని యనమల పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వర్గీకరణ అమలుచేయడానికి ఆనాడు చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం సానుకూలంగా నిలిచిందన్నారు. వర్గీకరణ అంశం చాలాకాలంగా పెండింగ్‌లో ఉందని, తాజాగా సుప్రీంకోర్టు అంతిమ నిర్ణయం హర్షించదగ్గ విషయం తెలిపారు.



పట్టుబడిన డ్రగ్స్‌ను చూపుతున్న కాకినాడ ఎస్‌డీపీవో హనుమంతరావు


గంజాయి ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితులు అరెస్టు
- గంజాయి, మత్తుమాత్రలు, దగ్గు మందు స్వాధీనం

కాకినాడ క్రైం, ఆగస్టు1: గుట్టుగా గంజాయి, మత్తు మాత్రలు, నిషా తెచ్చే దగ్గు మందు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను కాకినాడ పోలీసులు గురువారం చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి 6.50 కిలోల గంజాయి, 48 దగ్గు మందు బాటిళ్లు, మానసిక రోగులకు వాడే నైట్రోవిట్ 10ఎంజీ 4,500 టాబ్లెట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ ఎస్‌డీపీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌డీపీవో కె.హనుమంతరావు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ విధుల్లో చేరిన వెంటనే గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆయన గంజాయి కట్టడికోసం మూడు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ క్రమంలో సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా స్థానిక పాత బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, కమర్షియల్ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో స్థానిక జగన్నాథపురం, మామిడిపల్లి వారి వీధికి చెందిన షేక్ ఇస్మాయిల్, అదే ప్రాంతానికి చెందిన షేక్ మౌలాలి కలిసి అల్లూరిసీతారామరాజు జిల్లా జి మాడుగుల మండలం గొప్పలపాలెం గ్రామానికి చెందిన జగ్గందొర కొండబాబులు వద్ద గంజాయి, బీహర్ రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తి వద్ద మత్తుటాబ్లెట్‌లు, దగ్గు మందును కొనుగోలు చేసి కాకినాడ నగరంలో ఉన్న యువతకు అలవాటు చేసి వాటిని అధిక మొత్తంలో విక్రయించి డబ్బు సంపాదిస్తున్నట్టు అంగీకరించారు. ఇంకా ఈ కేసుకు సంబంధించి మత్తు పదార్థాలు అందజేసిన బీహర్ వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్‌డీపీవో తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రత్యేక కృషి చేసిన వన్‌టౌన్ సీఐ వి.సురేష్‌బాబు, క్రైం సీఐ చిట్టిబాబు, సిబ్బందిని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.



అలనాటి భవనం.. కనుమరుగేనా?



పిఠాపురంలో 110 ఏళ్ల కిందట నిర్మించిన ఆర్ఆర్ బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనం.. పురాతన భవనం తొలగించాలంటూ కాలేజీకి పిఠాపురం కమిషనర్ జారీచేసిన నోటీసు

- జూనియర్ కళాశాల భవనం తొలగించాలని నోటీసులు
- ఫలించని ఆధునికీకరణ ప్రయత్నాలు

పిఠాపురం,ఆగస్టు1: శతాబ్దంపైగా చరిత్ర కలిగి, మహారాజా కాలంలో నిర్మించిన పురాతన భవనం ఇక కనుమరుగవుతుందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ భవనాన్ని జీర్ణోద్ధరణ చేసి ఆధునికీకరించాలన్న చాలాకాలంగా చేస్తున్న ప్రయత్నాలు ఇక ఫలించనట్టే కనిపిస్తోంది. తాజాగా శిథిలావస్థకు చేరిన ఈ భవనాలు తొలగించాలంటూ మునిసిపల్ అధికారులు కళాశాలకు నోటీసులు జారీచేశారు. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విశిష్ట చరిత్ర ఉంది. పిఠాపురం మహారాజాకాలంలో ఏర్పాటైన ఈ కళాశాలను 1914 సంవత్సరంలో భవనాన్ని మహారాజా నిర్మించారు. అత్యంత విశాలంగా ఉండే ఈ భవనంలోనే తరగతులు జరిగేవి. ఈ భవనం నిర్వహణను ప్రభుత్వాలు విస్మరించడంతో శిథిలావస్థకు చేరింది. పలుచోట్ల వర్షం కారిపోవడంతోపాటు పెచ్చులూడి పడుతుండడంతో కొన్ని తరగతి గదుల వినియోగించడాన్ని మానివేశారు. ప్రస్తుతం ఇదే భవనంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు కొనసాగుతున్నాయి. గతంలో మూడు దశాబ్దాల కిందట ఒకసారి మరమ్మతులు నిర్వహించారు. అప్పట్లోనే ఈ భవనాన్ని పూర్తిగా నవీకరించాలన్న డిమాండ్ వచ్చింది. అప్పట్లో ప్రభుత్వం ముందుకు వస్తే తాను ఇందుకు అయ్యే వ్యయంలో 50 శాతం భరిస్తానని అభ్యుదయ ఫౌండేషన్ ఛైర్మన్ దివంగత బాదం మాధవరావు అప్పట్లో ప్రకటించారు. ఈ దిశగా ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ భవనాన్ని పరిశీలించి జేఎన్‌టీయూకే ఇంజనీరింగ్ అధికారుల బృందం దీన్ని తొలగించాలని సూచించినా చారిత్రక ప్రాశస్త్యం కలిగినది కావడంతో అలాగే ఉంచారు.

నోటీసులు జారీ

తాజాగా ఇప్పుడు పిఠాపురం మునిసిపల్ అధికారులు సదరు పురాతన భవనాన్ని తొలగించాలంటూ నోటీసులు జారీచేశారు. పురపాలక సంఘాల చట్టంలోని సెక్షన్ 231 కింద నోటీసు జారీచేస్తూ పురాతన భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నందున వారంరోజుల్లో తొలగించాలని, లేకుండా మరమ్మతులు చేయించి స్ట్రక్చరల్ సర్టిఫికెట్ సమర్పించాలని జూలై 20న కళాశాల ప్రిన్సిపాల్‌కు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. లేకుంటే ఎటువంటి ప్రాణాపాయం, నష్టం జరిగినా క్రిమినల్ చర్యలకు గురవుతారని హెచ్చరించారు. ఆ విధంగా చేయకుంటే తామే పురాతన భవనాన్ని తొలగించి ఆ ఖర్చులను వసూలు చేస్తామని స్పష్టం చేశారు. నోటీసులు జారీ అయిన విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి స్పందన రాలేదని సమాచారం. దీంతో పురాతన భవనాన్ని తొలగిస్తారనే భావన వ్యక్తమవుతోంది.

మరో ఆరు నెలలపాటు వందేభారత్‌కు సామర్లకోటలో స్టాప్ పొడిగింపు

సామర్లకోట, ఆగస్టు1: విశాఖ-సికింద్రాబాద్- విశాఖ మధ్య రాకపోకలు సాగించే 20833, 20834 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సామర్లకోటలో హాల్ట్‌ను మరో ఆరు నెలలపాటు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ ఎస్టీఎం చార్జి అధికారి రాజా నర్సు ఒక లేఖ ద్వారా తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు గురువారం సాయంత్రం సామర్లకోట రైల్వేస్టేషన్ ఉన్నతాధికారికి అందాయి. ఈ ఉత్తర్వులు ఈనెల 3 నుంచి అమలులోకి వస్తాయని తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఇప్పటివరకూ రెగ్యులర్ హాల్ట్ లేదు. తాజాగా రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం ఉపయుక్తం కాగలదు.

భద్రత కల్పించాలి : హైకోర్టుకు ద్వారంపూడి

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తనకు 1 ప్లస్ 1 భద్రత కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టులో విచారణకురాగా చంద్రశేఖరెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఏ నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా భద్రతను తొలగించారని, భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. పోలీసుల తరఫు న్యాయవాది స్పందిస్తూ వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశిస్తూ వ్యాజ్యం ప్రతివాదులుగా ఉన్న హోం ముఖ్యకార్యదర్శి, డీజీపీ, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, కాకినాడ జిల్లా ఎస్పీలకు నోటీసులు జారీచేశారు.

అమ్మపాలు అమృతం



తల్లిపాల వారోత్సవాల సందర్భంగా...

అంబాజీపేట, ఆగస్టు 1: అమ్మ పాలు అమృతంతో సమానం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తి పొందాలంటే తల్లి పాలు పట్టించాల్సిందే. తల్లి పాలను పుట్టిన బిడ్డకు పడితే ఇద్దరికీ ఎన్నో లాభాలున్నాయి. ఎన్నో రకాల వ్యాధులు దరిచేరవు. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి .. రోజుకు ఎన్నిసార్లు పట్టాలి.. ఎలా పట్టాలి.... తల్లిపాలు పుష్కలంగా రావాలంటే ఏం తినాలి.. ముర్రు పాలు ఎప్పుడు పట్టాలి... ఇలా చాలా అంశాలపై అందరికీ అవగాహన ఉండదు. ఆధునిక కాలం అమ్మలకు ఈ విషయాలపై అవగాహన మరీ తక్కువ. ఇలాంటి అంశాలకు వారికి తెలియజేస్తూ తల్లిపాలు ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లి పాలు వారోత్సవాలను గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించనున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఆరోగ్య శాఖ అనుబంధంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు.

ముర్రుపాలు తప్పనిసరి ఎందుకంటే...

- బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలనే ముర్రుపాలు అంటారు.
- శిశువుకు ఇవి కచ్చితంగా పట్టాలి. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు, విటమిన్-ఎ ఉంటాయి.
- వ్యాధులు రాకుండా బిడ్డను జీవిత కాలం కాపాడతాయి.
- శిశువు ప్రేగులను శుభ్రం చేసి మొదటి మల విసర్జనకు తోడ్పడతాయి.
- తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలు రావట్లేదని అనుకోవడం అపోహ మాత్రమే.
- బిడ్డ పుట్టగానే పాలు మూడు, నాలుగు రోజుల వరకు తేనె నాకించడం, పంచదార నీళ్లు ఇవ్వడం, గ్లూకోజ్ నీళ్లు ఇవ్వడం చేయకూడదు.
- ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా రోజుకు ఎనిమిది నుంచి పదిసార్లు పాలు ఇవ్వాలి.

తల్లిపాలు పుష్కలంగా రావాలంటే..

- గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్డు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు (స్వీటు కాదు) అంటే సహజంగా దొరికే పండ్లను శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

తల్లికి బోలెడు లాభాలు

- చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు తల్లులు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యం ఉంటారు. చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చు ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు.

బిడ్డకు లాభాలావీ...

- తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రోటీన్లు అంది మొదడు వికసిస్తుంది.
- ఈ పాలలో బిడ్డలకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో శిశువులను వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి.
- బిడ్డ మనోవికాసానికి తోడ్పడతాయి. బిడ్డ మృదువైన మలవిసర్జనకు, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి.
- తల్లి పాల ద్వారా బిడ్డలను డయేరియా, న్యుమోనియా వంటి ప్రాణాంతకు వ్యాధుల నుంచి కాపాడవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బుల నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి.
- ఎలర్జీ, ఆస్తమా, డయాబెటిస్ వంటి వ్యాధులు రావు.
- బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లిపాల దినోత్సవం ఇలా మొదలైంది...

ఇటలీ దేశంలోని ఫ్లోరెన్స్ నగరంలో ఇన్నోసెంటి సెంటర్లో 1990 జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు అంతర్జాతీయ సమావేశం జరిగింది. తల్లిపాల విశిష్టతను గుర్తించి ఏటా ఆగస్టు 1 నుంచి వారం పాటు తల్లిపాల వారోత్సవాలు జరుపుతున్నారు. తల్లిపాలపై తల్లుల్లో ఉన్న అపోహలను తొలగించి, తల్లిపాల గొప్పతనం చాటి చెప్పడం వీటి ప్రధానోద్దేశం.

తల్లిపాలు శిశువుకు ఎంతో మేలు

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలను ఆరు నెలల వరకు కచ్చితంగా ఇవ్వాలి. తల్లి నుంచి మొట్టమొదట వచ్చే పాలను పిల్లలకు ఇవ్వకూడదనే అపోహ ఉంది. కానీ అది సరైనది కాదు. మొదట మూడు రోజుల పాటు వచ్చే పాలలో (ముర్రుపాలు) కొలస్ట్రం ఉంటుంది. ఇది బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. కొలస్ట్రంలో ప్రొటీన్ పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బిడ్డకు రోగ నిరోధక శక్తినిస్తాయి. తల్లి నుంచి బిడ్డకు ఇమ్యూనోగోలబ్యులిన్స్ పాల ద్వారా బిడ్డకు చేరుతాయి. దీని పాజిటివ్ ఇమ్యూనిటీ అంటాం. దీంతో బిడ్డకు అంటువ్యాధులు రావు. మొదటి మూడు రోజులు కొలస్ట్రంతో కూడిన పాలు తాగని పిల్లలు విలువైన వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతారు. తల్లిపాల ద్వారా ఎలాంటి వ్యాధులూ దరిచేరవు.



అంబాజీపేట మండలం తొండవరంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తల్లి పాల శ్రేష్ఠతపై అవగాహన కల్పిస్తున్నారు. 46 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అప్పర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఎంహెచ్‌వో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



డొక్కా సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబు

డొక్కా సీతమ్మ సేవలు

భావితరాలకు గుర్తుండిపోతాయి

సీతమ్మ నివాసాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కూటమి నాయకులు

పి.గన్నవరం, ఆగస్టు 1: అపర అన్నపూర్ణగా ఖ్యాతిగాంచిన డొక్కా సీతమ్మ సేవలు భావితరాలకు గుర్తుండిపోయేలా కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. రాబోయే తరాలకు ఆదర్శంగా ఉండేలా విద్యా శాఖలో పథకాలకు డొక్కా సీతమ్మ, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం పేర్లు నిర్ణయిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు అయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గురువారం లంకల గన్నవరంలోని సీతమ్మ నివాసంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీసుకునే నిర్ణయాలు చారిత్రాత్మకంగా ఉంటాయన్నారు. సీతమ్మ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుందన్నారు. పి.గన్నవరం పాత అక్విడెక్టును పర్యాటక కేంద్రంగా మార్చే అంశాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉంచామని.... సీతమ్మ నివాసాన్ని కూడా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరతామన్నారు. నామన రాంబాబు మాట్లాడుతూ 2020లో బీజేపీతో భాగస్వామిగా ఉన్న సమయంలో పి.గన్నవరం అక్విడెక్టుకు డొక్కా సీతమ్మ పేరు పెట్టారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఈ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. డొక్కా నాద్‌బాబు మాట్లాడుతూ 2019 ఎన్నికలతో పాటు ఈ ఎన్నికల్లో కూడా ప్రతి బహిరంగ సభలోనూ డొక్కా సీతమ్మ పేరును పవన్‌కల్యాణ్ ప్రస్తావిం చారని గుర్తు చేశారు. తొలుత సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతమ్మ ఐదో తరం వారసుడు డొక్కా వెంకటభీమకామేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబులను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డొక్కా నాద్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, అవనిగడ్డ సత్తిబాబు, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, డొక్కా ప్రభాకరమూర్తి, శేరు శ్రీనుబాబు, త్సల్లా బిందుమాధవరావు, యర్రంశెట్టి తాత, గనిశెట్టి ఈశ్వర్, లంకే చిరంజీవి, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, బొరుసు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



సీతమ్మ ఐదో తరం వారసుడు భీమవెంకట కామేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నేతలు

దాళ్వా పంట సొమ్ములు వెంటనే చెల్లించాలి

ఎమ్మెల్సీ ఐవీ రావు

అమలాపురం టౌన్, ఆగస్టు 1: దాళ్వా పంట సొమ్ములు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) డిమాండు చేశారు. ఇదే అంశాన్ని శాసనమండలి సమావేశాల్లో చర్చించామన్నారు. కోనసీమ జిల్లాకు రూ.154.63 కోట్లు, పశ్చిమ గోదావరికి రూ.424.55 కోట్లు, కాకినాడకు రూ.9.49 కోట్లు,తూర్పుగోదావరి, బాపట్ల జిల్లాలతో కలిపి మొత్తం రూ.647 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారన్నారు రైతులు సార్వా పంటకు సిద్ధమయ్యే తరుణంలో సొమ్ములు చాలా అవసరమని, బకాయిలను తక్షణం విడుదల చేయాలని కోరారు. ఒక్క అమలాపురం రూరల్ మండలంలోనే 435 మంది రైతులకు రూ.5.63 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు.

ప్రజా నాయకులకు మరణం లేదు

నల్లమిల్లి మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు

అనపర్తి, ఆగస్టు 1: ప్రజల మనస్సుల్లో గూడు కట్టుకున్న నాయకులకు మరణం లేదని వారు ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో జీవిస్తూనే ఉంటారని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా జరిగిన పలు కార్యక్రమాల్లో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి నివాసంలో స్పీకర్ అయ్యన్న, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. మూలారెడ్డి చిత్రపటానికి, గ్రామంలోని విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకంలో పించన్లను పంపిణీ చేశారు. స్పీకర్ మాట్లాడుతూ నిబద్ధత కలిగిన ప్రభుత్వం ఏర్పడితే ప్రజల మోములో చిరునవ్వు వికసిస్తూనే ఉంటుందన్నారు. పెంచిన పింఛను రెండో నెలలో పంపిణీ చేయలేరని వైసీపీ నాయకులకు కనువిప్పు కావాలని దిగ్విజయంగా గంటల వ్యవధిలోనే సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేసి ప్రభుత్వం సత్తా చూపుతుందన్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా పయనిస్తోందని, హామీలు వంద శాతం పూర్తి చేయగల సత్తా చంద్రబాబుకు ఉందన్నారు.

బిక్కవోలు మండలం పందలపాకలో ఏర్పాటు చేసిన నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని స్పీకర్ అయ్యన్న, మంత్రి ఆనం, ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు.



రామవరంలో మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



వివాహాలు చేయించే పురోహితుల పేర్లు, సెల్ నెంబర్లతో ఏర్పాటు చేసిన బోర్డు

అన్నవరం దేవస్థానంలో వివాహ దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

వివాహాలు చేయించే పురోహితులు, నాయీ బ్రాహ్మణుల పేర్లతో బోర్డులు

అన్నవరం, ఆగస్టు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో కొన్ని దశాబ్దాలుగా వేళ్లూనుకుపోయిన వివాహ దళారీ వ్యవస్థకు చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వివాహాల పేరుతో దళారులు భక్తుల నుంచి వేలాది రూపాయలు దోచేస్తున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో అన్నవరం దేవస్థానంలో వివాహాలు చేయించే 57 మంది పురోహితులు, 33 మంది సన్నాయి, భజంత్రీలు వాయించే నాయీబ్రాహ్మణుల పేర్లు, వారి ఫోను నంబర్లను వివాహాలు జరిగే ప్రదేశాల్లో బోర్డులు రూపంలో ఏర్పాటుచేశారు. వీటిని సీఆర్వో, పీఆర్వో, శివసదన్, హరిహర సదన్ కాటేజీల వద్ద పెడుతున్నట్టు అధికారులు వెల్లడించారు. వివాహ బృందాలు దళారుల ప్రమేయం లేకుండా వారితో నేరుగా మాట్లాడుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ధరలను కూడా దేవస్థానం నిర్ణయిస్తే బాగుంటుందని వివాహ బృందాలు పేర్కొంటున్నాయి.



వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న అయ్యన్నపాత్రుడు

తంటికొండ వెంకటేశ్వరస్వామికి స్పీకర్ ప్రత్యేక పూజలు

గోకవరం, ఆగస్టు 1: తంటికొండ వేంకటేశ్వరస్వామిని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి దేవస్థానం అధికారులు స్వామి ప్రసాదం అందించారు. టీడీపీ నాయకులు మంగరౌతు రాము, జనపరెడ్డి సుబ్బారావు, పాలూరి బోస్, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్నదొర, కన్నబాబు, అడపా భరత్, ఉంగరాల రాము, పోసిన ప్రసాద్, బదిరెడ్డి అచ్చన్నదొర, గెడ్డం బాబు, పెద్దాడ వెంకన్నదొర, మలిరెడ్డి సిరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వాగు నీటిలో పడి వ్యక్తి మృతి

చింతూరు, ఆగస్టు 1: వరద ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఉలుమూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... పూసం రాజయ్య (60) గేదెలకోసమని ఇంటి నుంచి శబరి ఒడ్డుకు గురువారం ఉదయాన్నే బయల్దేరాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో రాజయ్య కుటుంబీకులతో పాటు గ్రామస్తులు మధ్యాహ్న సమయంలో పరిసర ప్రాంతాల్లో వెతికారు. గ్రామ సమీపంలోని వాగు నీటిలో కూడా గాలించారు. చివరకు వాగు నీటిలో మృతదేహం బయటపడింది. శబరి ఒడ్డుకు వెళ్లే క్రమంలో వాగు దాటబోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. రాజయ్య మృతదేహాన్ని అతడి ఇంటికి తరలించారు. జరిగిన ఘటనపై రెవెన్యూ పోలీసు అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు.





రాజయ్య మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న గ్రామస్తులు, రాజయ్య (ఇన్‌సెట్‌లో)

గొల్లపాలెంలో గంజాయి బ్యాచ్ అరెస్టు

మలికిపురం, ఆగస్టు 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపాలెంలో గంజాయి తాగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది యువకుల్లో ఒకరు పారిపోగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 700 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. నిందితుల్లో ఒకరిని మైనరుగా గుర్తించారు. కేసు నమోదుచేసి నిందితులను రాజోలు కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ చెప్పారు.

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఆగస్టు 1: మరిడమ్మ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆరువేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాలు తెలియజేశారు.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా రూపకల్పన

- ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు అవకాశం
- దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీ సెప్టెంబరు 3

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1: ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా రూపకల్పనకు ఫారం-19 దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత నెల 29న ఈ ప్రక్రియ ఆరంభమైంది. ఓటర్లుగా నమోదుకు ఉపాధ్యాయులు సెప్టెంబరు 3 వరకు తమ దరఖాస్తులను అధికారులకు అందజేయాల్సి ఉంది. ఏపీ శాసనమండలిలో ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రూపొందిస్తున్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఈవోఆంధ్ర.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫారం-19లో వివరాలు నింపాలని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాటు ప్రిన్సిపాళ్ల ధ్రువీకరించిన దరఖాస్తు సమర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రిన్సిపాళ్లతో పాటు డీఈవో గానీ, ఆర్‌ఐవో గానీ, ఆర్‌జేడీగానీ తప్పనిసరిగా కౌంటర్ సంతకం చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వివరాలు సమర్పించాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

మెసేజ్ ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలో నగదు మాయం

లబోదిబోమన్న మహిళ పోలీసులకు ఫిర్యాదు... సైబర్ నేరంపై కేసు నమోదు

అంబాజీపేట, ఆగస్టు 1:

ఓ మహిళ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన మెసేజ్ ఓపెన్ చేయడంతో ఆమె ఖాతాల్లో ఉన్న రూ.2.20 లక్షలు మాయమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లికి చెందిన వేదుల కిరణకుమారి మొబైల్‌కు గత నెల 16వ తేదీన తెలియని మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేయగా 18న ఆధార్‌తో కూడిన ఓటీపీలు వచ్చాయి. ఆదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆమె ఖాతాలో ఉన్న నగదు దశల వారీగా కట్ అయ్యాయి. వెంటనే ఆమె పుల్లేటికుర్రులోని యూనియన్ బ్యాంకుకు వెళ్లి అధికారులకు సమాచారం ఇచ్చింది. ఆమె ఖాతా నుంచి మూడు దఫాలుగా రూ.1.50 లక్షలు రూ.50వేలు, రూ.20,500 గుర్తు తెలియని వ్యక్తికి బదిలీ అయినట్టు తెలిపారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. సైబర్ నేరంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

కుళాయి ద్వారా మురుగు నీరు

ఏలేశ్వరం, ఆగస్టు 1: పట్టణంలో కుళాయిలు ద్వారా మురుగునీరు సరఫరా కావడంతో ప్రజలు విస్మయానికి గురయ్యారు. మార్కెట్, వాగు వారి వీధి, మలిరెడ్డి వారివీధి, శివాలయం వీధుల్లో గురువారం కుళాయిల ద్వారా కలుషిత జలాలు వచ్చాయని ప్రజలు తెలిపారు.



నేడు విద్యుత్‌సరఫరా నిలుపుదల

జగ్గంపేట, ఆగస్టు 1: జగ్గంపేట 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్లు నరికివేత, లైన్ మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ కె.రత్నాలరావు తెలిపారు. మామిడాడ, నరేంద్రపట్నం, గోవిందపురం, కృష్ణపురంతోపాటు జగ్గంపేట పరిధిలోని శ్రీరామ్‌నగర్, ఎంప్లాయిస్ కాలనీ, టీచర్స్ కాలనీలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సామర్లకోటలోను సరఫరా నిలుపుదల

సామర్లకోట, ఆగస్టు 1: సామర్లకోట పట్టణ సబ్‌స్టేషన్ పరిధిలో బీబీఆర్ ఫీడర్ల వార్షిక మరమ్మత్తుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రి ఏరియా, ఓల్డ్ రాజీవ్‌గృహకల్ప ఏరియా, యానాదుల కాలనీ, గణపతినగరం, పెద్దాపురం రోడ్డు ఇరువైపులా, లారీ యూనియన్ ఏరియా, గాంధీనగర్, అమ్మానమ్మ నాయుడు కాలనీ ఏరియా, టిడ్కో అపార్ట్‌మెంట్స్, పెదపులి చెరువు ఏరియా, మేటీనగర్, భాస్కర్ కాలనీ, సాయినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'

ఏలేశ్వరం, ఆగస్టు 1: పట్టణంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు నేతృత్వంలో మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్ గురువారం మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఆయన పిలుపునిచ్చారు. గొల్లపూడి గణేష్, తందూరి రాము, అలమండ దుర్గా వెంకట ప్రసాద్, అవసరాల కిషోర్ పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్ల పనుల పర్యవేక్షణ

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 1: నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం సంత చెరువువద్ద ప్రతిపాదించిన అన్నాక్యాంటీన్ పనులను పరిశీలించారు. ఎస్‌ఈ పి.సత్యకుమారి పనుల ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. ఎస్‌ఈ పి.సత్యకుమారి, ఈఈ మాధవి ఉన్నారు.

తామరాడ మీదుగా బస్సు సర్వీసు

కిర్లంపూడి, ఆగస్టు 1: ఏలేశ్వరం ఆర్టీసీ డిపో నుంచి కిర్లంపూడి మండలం తామరాడ మీదుగా కాకినాడ వెళ్లే బస్సు సర్వీసును గురువారం ఏలేశ్వరం డీఎం సత్యనారాయణ ప్రారంభించారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడి, తామరాడ, కాండ్రకోట మీదుగా పెద్దాపురం వయా కాకినాడ చేరుకుంటుందన్నారు.

బస్సు సౌకర్యం కల్పనపై హర్షం

పెద్దాపురం, ఆగస్టు 1: మండలంలోని కాండ్రకోట మీదుగా ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాలతో కాకినాడనుంచి పెద్దాపురం, గుడివాడ, సిరివాడ, కాండ్రకోట, తామరాడపాలెం, బూరుగుపూడి,ఎర్రవరం మీదుగా ఈ బస్సు ఏలేశ్వరం చేరుతుంది. తమ గ్రామం మీదుగా బస్సు పునరుద్ధరణ కావడంతో గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు.

కోతుల బెడద నివారించాలని వినతి

ప్రత్తిపాడు, ఆగస్టు 1: ప్రత్తిపాడులో కోతుల బెడద తీవ్రంగా ఉందని, వాటినుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు పలువురు గురువారం వినతిపత్రం అందజేశారు. లయన్స్‌క్లబ్ పాస్ట్ అధ్యక్షుడు ఎం.సంజీవరావు, చవల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలు ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివచ్చి కోతుల కారణంగా పడుతున్న అవస్థలు ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు.

ప్రత్తిపాడులో వైద్యశిబిరం

ప్రత్తిపాడు, ఆగస్టు 1: ప్రత్తిపాడు కోర్టువద్దగల బార్ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు ప్రారంభించారు. కాకినాడ అక్సలేట్ ల్యాబ్ నిపుణులు లాయర్లు, పోలీసులకు రక్తపరీక్షలు నిర్వహించారు.

సత్యదేవుడి సన్నిధిలో నాగఫణిశర్మ

అన్నవరం, ఆగస్టు 1: రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖ పండితులు, సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ ప్రత్యేకపూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. సత్యదేవుడిపై ఆయన పలు పాటలను రాయగా అవి ఇప్పటికీ ఎంతో శ్రావ్యంగా భక్తులను రంజింపచేస్తున్నాయి.

కొమరగిరి లేఅవుట్‌లో కమిషనర్ పర్యటన

కొమరగిరి(కొత్తపల్లి), ఆగస్టు 1: ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు కొమరగిరి లేఅవుట్ సమీపంలోఉన్న ఓ రైతుకు చెందిన మూడెకరాలకు నీరు అందడం లేదన్న సమస్యను పరిష్కరించేందుకు కాకినాడ కమిషనర్ భావన గురువారం పరిశీలించారు.

ఏరియా ఆస్పత్రిలో ఆర్డీవో తనిఖీ

తుని రూరల్, ఆగస్టు 1: తుని ఏరియా ఆస్పత్రిని పెద్దాపురం ఆర్డీవో సీతారామయ్య అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఇటీవల కలెక్టర్ ఈ ఆస్పత్రిని సందర్శించి పలు లోపాలు గుర్తించారు. వీటిని గడువులోపు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్యే హెల్త్ సెంటర్ పరిశీలన

తుని రూరల్, ఆగస్టు 1: తునిలో సీతారాంపురం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఎమ్మెల్యే యనమల దివ్య తనిఖీ చేపట్టారు. రోగులనుంచి పలు ఫిర్యాదులు రావడంతో ఆమె ఆస్పత్రిలో రికార్డులతోపాటు మెడిసిన్ నిల్వలు, అందుతున్న సేవలను పరిశీలించారు.

'పేదల ఆకలి బాధలు తీర్చడమే లక్ష్యం'

పిఠాపురం, ఆగస్టు 1: పేదల ఆకలి బాధలు తీర్చడమే ప్రభుత్వం లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి తెలిపారు. వర్మాస్ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్కెట్‌సెంటర్‌లో ప్రతి గురువారం నిర్వహించే అన్నక్యాంటీన్‌లో ఆమెపేదలకు భోజనాలు వడ్డించారు.

'శ్రీచైతన్య'లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ



సర్పవరం జంక్షన్, ఆగస్టు 1: రమణయ్యపేట శ్రీచైతన్య టెక్నోస్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శైలజ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా సర్పవరం సీఐ శ్రీరామకృష్ణ పాల్గొన్నారు. పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో విజేతలకు మెడల్స్, బ్యాడ్జిలు అందజేశారు. శ్రీచైతన్య దక్షిణ ప్రాంత ఏజీఎం సురేష్, రీజినల్ ఇన్‌చార్జి గోపీనాథ్, కోఆర్డినేటర్ జనార్దన్ విద్యార్థులను అభినందించారు.

95శాతం పైబడి పింఛన్ల పంపిణీ పూర్తి

» ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన నేతలు



సామర్లకోటలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

కాకినాడ సిటీ, ఆగస్టు 1: ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ సొమ్ము రూ.4వేలకు పెంచి కూటమి ప్రభుత్వం నిరుపేదల ఆదరాభిమానాలు చూరగొందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకం ద్వారా 10వ డివిజన్ దుమ్ములపేటలో నాయకులతో కలిసి గురువారం ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, జనసేన రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్, స్థానిక నాయకులు మోసా పేతూరు, ఎరిపల్లి రాము, మూగు రాజు, చోడిపిల్లి సతీష్, తుమ్మల సునీత, తిరిగి ఎల్లయమ్మ, చోడిపిల్లి ప్రేమానందం, కొండ్రు తాతారావు, మేరుగు రాజన్న, గంపల లక్ష్మణరావు, దిబ్బాడ పోలరాజు, ఎరిపిల్లి సత్తిబాబు పాల్గొన్నారు. మాజీ మేయర్ సుంకర పావని 28వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్‌లు పంపిణీ చేశారు.

'ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి'

సామర్లకోట, ఆగస్టు 1: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు కూటమి పార్టీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు పరిచేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్ల కోట మండలం పనసపాడు పంచాయతీ ఆవరణలో ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు ఫించన్లను పంపిణీ చేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, బీజేపీ ఇన్‌చార్జి, వెంకటరమణ, సర్పంచ్ చీకట్ల వెంకటేష్‌లతో కలిసి లబ్ధిదారులకు పించను సొమ్ములు అందజేశారు. ఉదయం 10గంటలకే పట్టణంలో 15 సచివాలయాల్లోను 6,431 పింఛన్లకుగాను 5,245మందికి పంపిణీ పూర్తిచేయడం ద్వారా 81.56శాతంతో రూ.2కోట్ల22 లక్షల54వేల500లను పంపిణీ పూర్తి చేశారు.

కొండెవరంలో పింఛన్లు పంపిణీ చేసిన నాగబాబు

కొత్తపల్లి, ఆగస్టు 1: జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు కొత్తపల్లి మండలం కొండెవరం శివారు జోగిరాజుపేటలో వృద్ధులకు, వికలాంగులకు గురువారం పింఛన్లను అందజేశారు. కొండెవరం ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, గాది రాజబాబు, బీజేపీ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జోరువానలో పింఛన్లు పంపిణీ

ఏలేశ్వరం, ఆగస్టు 1: ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ యర్రవరంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి నాయకులతో కలిసి మండలంలోని యర్రవరంలో గురువారం వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు అందజేశారు. పట్టణంలో వార్డు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్/కోటనందూరు, ఆగస్టు 1: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని పట్టణంతోపాటుగా రూరల్‌లోని హంసవరంలో, కోటనందూరు లోను కార్యకర్తలు, అధికారులతో కలిసి పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), ఇనుగంటి సత్యనారాయణ, మడికి భాస్కర్ ఉన్నారు.

తొండంగి, ఆగస్టు 1: పైడికొండలో గురువారం ఎమ్మెల్యే దివ్య సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతనీడి అబ్బాయి, కొయ్యా రామకేశవ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటరమణ, సిద్దారాంబాబు, పిర్ల శివ,దూలం మురళి, సతీష్, అరిగెల నర్సింహమూర్తి ఉన్నారు.

మండలాలవారీగా..

సర్పవరం జంక్షన్, ఆగస్టు 1: వృద్ధాప్యం కుటుంబసభ్యులకు భారం కాకూడదనే ఉద్దేశంతో వృద్ధులు, వికలాంగులు, వితంతు తదితర లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్ సొమ్ము పెంచి సామాజిక బాధ్యత చాటుకున్నారని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. తిమ్మాపురంలో వృద్ధులకు బుధవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, పార్టీ నాయకులు మాదారపు తాతాజీ , ఇంద్ర, బత్తుల దొరబాబు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి దంపతులు బుధవారం గైగోలుపాడు, వలసపాకల, వాకలపూడి, రాయుడుపాలెం, పి.వెంకటాపురం, ఏపీఎస్పీ, పెనుమర్తి గ్రామాల్లో అధికారులతో కలసి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. పార్టీ కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా లబ్ధిదారులకు పింఛన్ అందించారు.

గండేపల్లిలో 95శాతం

గండేపల్లి, ఆగస్టు 1: గురువారం ఉదయం 6గంటల నుంచి నాయకులు, అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మల్లేపల్లిలో ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెలగారెడ్డి భద్రరావు, పలువురు నాయకుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది. మండలవ్యాప్తంగా ఒక్కరోజులోనే 95శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.



ఏలేశ్వరం మండలం యర్రవరంలో వర్షంలోను వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

తాళ్లరేవులో 96శాతం

తాళ్లరేవు, ఆగస్టు 1: గ్రామాల్లో 96శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ప్రభాకరరావు గురువారం తెలిపారు.పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో డీఎమ్ అండ్ హెచ్‌వో మంచంపై ఉన్న లబ్ధిదారుడికి రూ.15వేల పింఛను అందించారు.

కరపలో 97.56శాతం

కరప, ఆగస్టు 1: కరప మండలంలో అధికారులు తొలిరోజే 97.56శాతం మంది లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేసి సత్తా చాటారు. మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలో 11,526మంది పింఛన్‌దారులుండగా గురువారం రాత్రికి 11,245మందికి పింఛన్ల సొమ్ము అందించినట్టు ఎంపీడీవో అప్పారావు తెలిపారు.

అన్నవరంలో 98శాతం

అన్నవరం, ఆగస్టు 1: ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా తొలిరోజున అన్నవరంలో 98శాతం పింఛన్లు పంపిణీ చేశారు. దళితపేటలో మాజీసర్పంచ్ రాజాల చిట్టిబాబు, ఎండీ పేటలో పలివెల సతీష్, కొత్తపేటలో టీడీపీ నాయకులు అల్లు సత్తిబాబు, కడుపుకుట్ల కృష్ణ సమక్షంలో పంపిణీ ప్రారంభించారు.

జగ్గంపేటలో 95శాతం

జగ్గంపేట, ఆగస్టు 1: జగ్గంపేటలో 12,484మందికి పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభి 95శాతం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వసంత్‌కుమార్ తెలిపారు. మారిశెట్టి భద్రం, ఎస్‌వీఎస్ అప్పలరాజు, దేవరపల్లి మూర్తి, మణిబాబు, హరిగోపాల్ పాల్గొన్నారు.



నడకుదురులో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న టీడీపీ నేత కటకంశెట్టి బాబి



కోటనందూరులో పింఛను అందిస్తున్న తుని ఎమ్మెల్యే దివ్య



కాకినాడ రూరల్‌లో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

ఎస్సీల వర్గీకరణ తీర్పుపై మాదిగల హర్షం

ప్రత్తిపాడు, ఆగస్టు 1: ప్రత్తిపాడులో గురువారం నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రత్తిపాడులో భారీప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ కళామందిర్‌సెంటర్‌వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతారపురాజు, ప్రధాన కార్యదర్శి ధూలపల్లి రమణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



ప్రత్తిపాడులో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సంఘ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, జిల్లా సంఘ ప్రతినిధులు వేమగిరి నానిబాబు, హరిసాడ హరిబాబు, దేవారపు సురేష్, పలివెల సతీష్, కాపారపునూకరాజు,గెడ్డ సతీష్, కాయల సారబాబు, కాతేటి మంగరాజు, జెడ్డసత్తిబాబు, జెడ్డ రాజేంద్రప్రసాద్, మాసా జాను, నాగేంద్ర, గెడ్డం శ్రీను పాల్గొన్నారు.

తునిలో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభ

తుని రూరల్, ఆగస్టు 1: సుప్రీంకోర్టులో తీర్పు వర్గీకరణకు అనుకూలంగా రావడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కృష్ణ మాదిగ ఆదేశాలతో తునిలో విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంచి బాణసంచా కాల్చారు.

సామర్లకోటలో మాదిగల హర్షం

సామర్లకోట, ఆగస్టు 1: ఎస్సీ కుల వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపట్ల సామర్లకోటలోని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు సామర్లకోట నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, తాతపూడి కృష్ణబాబు, విజయకుమార్, నందికి చక్రవర్తి, మిరియాల సాగర్, కాపవరపు కుమార్, మిరియాల అజయ్ తదితరుల ఆధ్వర్యంలో పట్టణంలో స్టేషన్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. మాదిగల మూడు దశాబ్దాల కల నెరవేరుతోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి జేజేలు పలికారు. తమ ఉద్యమానికి సహకరించిన నాయకులకు, వివిధ రాజకీయ పార్టీలకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఉద్యమ నమస్కారాలు తెలిపారు.



తుని గొల్ల అప్పారావు సెంటర్‌లో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కొత్తపల్లిలో ఎమ్మార్పీఎస్ సంబరాలు

కొత్తపల్లి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరుపుకొన్నారు. మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షులు మొర్త రవి ఆధ్వర్యంలో కొండెవరం జోగిరాజుపేటవద్ద అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలవద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు.

తల్లిపాల విశిష్టత పై అవగాహన

జీజీహెచ్(కాకినాడ)/కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 1: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లో గురువారం తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుషేన హెల్త్ ఫౌండేషన్ ధాత్రి మదర్ మిల్క్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 7 వరకు జరిగే కార్యక్రమాలపై ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ వివరించారు. మిల్క్ బ్యాంక్ మేనేజర్ శివ మాధవ్, సీడీపీవో ఎ.జ్యోతి, డీసీపీవో వెంకట్‌గారు, సూపర్‌వైజర్లు దయామణి, అరుణ, ప్రభావతి పాల్గొన్నారు.

తుని రూరల్, ఆగస్టు 1: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కొండవారిపేట 4వ వార్డులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. తల్లిపాల వల్ల కలిగే లాభాలపై సీడీపీవో నిహారిక అవగాహన కల్పించారు.

కిర్లంపూడి, ఆగస్టు 1: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గెద్దనాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో పూర్ణిమ తల్లిపాలపై గురువారం అవగాహనసదస్సు నిర్వహించారు. సర్పంచ్ ఎం.గంగాభవానీ, పీహెచ్ఎన్ పి.అప్పలకొండ, హెచ్‌వీఎస్ అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు ఔషధ కారకమని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని ప్రత్తిపాడు వైద్యవిధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య, ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి తెలిపారు.

పిఠాపురం, ఆగస్టు 1: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు పోషకాలు లభిస్తాయని వైద్యాధికారి జయరాం తెలిపారు. పిఠాపురం పట్టణంలోని ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నిత్యాన్నదానానికి రూ.35వేల విరాళం

సామర్లకోట, ఆగస్టు 1: భీమేశ్వరాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెద్దాపురానికి చెందిన చిలుకూరి వెంకటలక్ష్మి రూ.25వేలు, వైట్ల సత్యవతి రూ.10వేల చొప్పున విరాళాలను గురువారం ఆలయ ఈవో బళ్ళ నీలకంఠంకు దాతలు అందజేశారు.

ట్రాఫిక్ జాగ్రత్తలపై ర్యాలీ

తాళ్లరేవు, ఆగస్టు 1: కోరింగ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు గురువారం కోరింగలో ర్యాలీ నిర్వహించారు. డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ కిట్లు అందజేత

శంఖవరం, ఆగస్టు 1: కత్తిపూడి గ్రామశివారు కొండవారిపేట ప్రజలకు జనవికాస స్వచ్ఛంద సంస్థ ఉచితంగా మెడికల్ కిట్లు అందజేసింది. కేటీసీ ఎస్‌బీసీ విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, జాన్, రత్నం పాల్గొన్నారు.

గ్రాంట్లు రూపంలో ఏపీకి నిధులు ఇవ్వాలని సీపీఎం ధర్నా

పిఠాపురం, ఆగస్టు 1: విభజన చట్టంలోని హామీలను అమలు చేస్తూ గ్రాంట్లు రూపంలో ఏపీకి నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం పిఠాపురం తహసీల్దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జి, కుంచే చిన్నా, కోనేటి రాజు, నాగేశ్వరరావు, విశ్వనాథం, మణి, వీరబాబు, సూర్యచక్రం, నాగశ్రీనివాస్, రాంబాబు, బాహుజీ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పిఠాపురం ఆలయాల్లో ఎమ్మెల్సీ పూజలు

పిఠాపురం, ఆగస్టు 1: పిఠాపురం పట్టణంలోని ఆలయాలను ఎమ్మెల్సీ హరిప్రసాద్ గురువారం సందర్శించారు. పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేద పండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ఈవో దుర్గాభవానీ ఎమ్మెల్సీని ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు. శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని సందర్శించి శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహసరస్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఔదంబర వృక్షానికి కొబ్బరికాయ కట్టి ప్రదక్షిణలు చేశారు. ఆలయ ఈవో సౌజన్య హరిప్రసాద్‌కు ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.



కొబ్బరికాయ కట్టి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్

ఉద్యోగికి విధి నిర్వహణలో సేవలే సంతృప్తినిస్తాయి: ఆర్డీవో

కాకినాడ సిటీ, ఆగస్టు 1: జీవితంలో ప్రతిఉద్యోగికి విధి నిర్వహణలో చేసిన సేవలే సంతృప్తినిస్తాయని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ అన్నారు. కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయ పరిపాలనాధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన గోగుల వరహాలయ్యను కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఘనంగా సత్కరించారు.

15న అన్నక్యాంటీన్ ప్రారంభించేందుకు సన్నాహాలు

సామర్లకోట, ఆగస్టు 1: సామర్లకోటలో టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా అన్నక్యాంటీన్‌ను ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ప్రజారోగ్య డీఈ హుస్సేన్ వెల్లడించారు. సామర్లకోటలో అన్నక్యాంటీన్ సుందరీకరణ పనుల అమలుతీరును టీడీపీ నాయకులతో కలిసి గురువారం సందర్శించారు.

రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలి: ఆర్డీవో

పెద్దాపురం, ఆగస్టు 1: రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీవో జె.సీతారామారావు ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని 11 మండలాల తహశీల్దార్లతో పీజీఆర్ఎస్ గురువారం సమీక్ష నిర్వహించారు. భూసమస్యలు, మ్యూటేషన్లు తదితర సమస్యలపై చర్చించారు. పీజీఆర్ఎస్ సమస్యలను గడువులో పరిష్కరించాలన్నారు. ఇన్‌చార్జ్ తహశీల్దార్ కాంతారావు, ఆర్డీవో కార్యాలయ డీటీ భానుకుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలి: వర్మ

ఉప్పాడ(కొత్తపల్లి), ఆగస్టు 1: ఉప్పాడలో నిర్మాణంలో ఉన్న హార్బర్ మొగలో కెరటాలు ఎక్కువగా రావడంవల్ల మత్స్యకారులకు ప్రాణహాని జరుగుతుందని, వారికి హార్బర్ యాజమాన్యం పూర్తి రక్షణ కల్పించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ డిమాండ్ చేశారు. ఉప్పాడ హార్బర్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో గురువారం ఆయన మత్స్యకారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో అధికారంలోఉన్న కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో హార్బర్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేస్తారన్నారు. అనిశెట్టి సత్యానందరెడ్డి, సూరాడరాజు, రాచపల్లి సనపయ్య, మేరుగు భూషణం, సూరాడ నాగేశ్వరరావు, చోడిపల్లి ప్రసాద్, ఓసిపల్లి అప్పన్న, చీకోటి బుజ్జి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

గొల్లప్రోలు, ఆగస్టు 1: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ ఏపీ మునిసిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత కుంచే చిన్నా, యూనియన్ అధ్యక్షురాలు ఏసమ్మలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమ్మె చేసిన కాలానికి వేతనాలు చెల్లించాలన్నారు. వీరి ఆందోళనకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు సంఘీభావం తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన తప్పనిసరి

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 1: విద్యార్థి దశనుంచే ఆరోగ్య విషయాలతోపాటు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. జిల్లాస్థాయిలో 8 నుంచి 10వ తరగతులు చదువుతున్న 17 హైస్కూల్స్ విద్యార్థులకు వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, ఎస్‌టీఐ, ఆర్‌టీఐ, జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు 15న బహుమతులు అందిస్తారన్నారు.

'ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి'

జగ్గంపేట, ఆగస్టు 1: జగ్గంపేటలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని జగ్గంపేట కాపు కల్యాణ మండపంవద్ద ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు గురువారం నిరసన తెలిపారు. జగ్గంపేటలో గత వైసీపీ ప్రభుత్వంలో 2వేలమందికి ఇళ్ల స్థలాలు కేటాయించినా ఇంకా 500మంది ఇళ్లస్థలాలు రాని వారున్నారన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు కొండా దుర్గారావు, జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు పాల్గొన్నారు.

రాధాకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

కాకినాడ సిటీ, ఆగస్టు 1: కాకినాడలోని జిల్లా ఫైలేరియా విభాగంలో పనిచేస్తూ ఇటీవల కనిపించకుండా పోయిన సీనియర్ అసిస్టెంట్ కె.రాధాకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ కోరారు. ఈ మేరకు రాధాకృష్ణ కుటుంబ సభ్యులను కలెక్టర్ వద్దకు గురువారం తీసుకెళ్లి పరిస్థితి వివరించారు. దీనిపై తగు న్యాయం చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

ముగ్గురు తపాలా ఉద్యోగులకు ఐదేళ్ల జైలు

విశాఖపట్నం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులను మోసం చేసిన కేసులో ముగ్గురు తపాలాశాఖ ఉద్యోగులకు ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సీబీఐ కేసుల న్యాయస్థానం అదనపు ప్రత్యేక న్యాయమూర్తి సీఎస్ మూర్తి గురువారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి సీబీఐ అధికారులు ప్రకటన విడుదల చేశారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం సబ్ పోస్టాఫీస్‌లోని సబ్ పోస్ట్‌మాస్టర్ కొడమంచిలి రాజేంద్రప్రసాద్, పోస్టల్ అసిస్టెంట్లు ఐ.సత్యనారాయణ, పి.అప్పలస్వామి కలిసి 2009, అక్టోబరు 21 నుంచి 2012, సెప్టెంబరు 29 వరకూ రికరింగ్ డిపాజిట్లు కలిగిన 153మంది ఖాతాదారులు మహిళా ప్రధాన్ క్షేత్రియ బచత్ యోజన (ఎంపీకేబీవై) కోసం కట్టిన రూ.30,56,429ను వారి ఖాతాలకు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. నేరపూరిత ఆలోచనతో పథకం ప్రకారం తపాలాశాఖతోపాటు ఖాతాదారులను మోసంచేసిన ముగ్గురిపైనా సీబీఐ కేసు నమోదుచేసింది. నేరం రుజువు కావడంతో సీబీఐకోర్టు నిందితులుముగ్గురికీ ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రాజేంద్రప్రసాద్‌కి రూ.7వేలు, ఐ.సత్యనారాయణకు రూ.8.29లక్షలు, పి.అప్పలస్వామికి రూ.8.59 లక్షల జరిమానా విధించింది.

కార్మికుల హాజరుపై కమిషనర్ ఆరా

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 1: నగరంలోని పదో సర్కిల్ పరిధి చిన్న మార్కెట్ ప్రాంతంలో ఉన్న మస్తరు కేంద్రం వద్ద గురువారం ఉదయం 5.30గంటలకే కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన రికార్డులను పరిశీలించి పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఇంటింటికీ చెత్త సేకరణపై ఆమె ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌కు సూచనలు ఇచ్చారు.